# వీధి వ్యాపారులకు చేయూత

**మూడో విడతలో 5,346 మందికి రూ.26.38 కోట్ల రుణాల పంపిణీ**




వీధి వ్యాపారులకు రుణాలను పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)

సిటీబ్యూరో, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ ): గ్రేటర్ హైదరాబాద్‌లో వీధి వ్యాపారులకు ఆర్థిక చేయూతనందించి, వారిలో జీవన ప్రమాణాలను పెంపొందించడంలో జీహెచ్ఎంసీ ప్రత్యేక పాత్రను పోషిస్తున్నది. వీధి వ్యాపారులకు రుణాల అందజేతలో ప్రతి విడతలో మెరుగైన ప్రదర్శనను రాబడుతున్నది. ఇందులో భాగంగానే మూడవ విడతలో 5346 మందికిగానూ రూ.26.38 కోట్ల మేర రుణాలను అందజేసింది. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే అమలు చేస్తున్న వీధి వ్యాపారుల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి పీఎం సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన, శ్రమయోగి మందన్ పింఛన్ యోజన, మాతృవందన యోజన, జననీ సురక్ష యోజన, జన్‌ధన్ యోజన, వన్ నేషన్ వన్ కార్డు తదితర పథకాలను మరింత పకడ్బందీగా అందించేందుకు వీధి వ్యాపారుల పూర్తి వివరాలతో కూడిన సమాచారాన్ని పొందుపర్చేందుకు వెబ్ ఆధారిత ప్రత్యేక సమగ్ర యాప్‌ను రూపొందించింది. ఇందులో భాగంగానే వీధి వ్యాపారులను చైతన్యం చేసే వారికి ప్రభుత్వ పథకాలు వర్తింపజేసేందుకు 'మైబిడిజిటల్' అనే కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాకుండా డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహిస్తున్నారు. వీటితో పాటు వీధి వ్యాపారులతో స్విగ్గీ, జొమోటోలు ఒప్పందం కుదుర్చుకుంటుండటం గమనార్హం.

**స్ట్రీట్ వెండర్స్ వివరాలు..**

| | |
|---|---|
| వీధి వ్యాపారులను గుర్తించినవి | 1,65,442 |
| ఐడీ కార్డులు జారీ చేసినవి | 1,65,107 |
| టౌన్ వెండింగ్ కమిటీల ఏర్పాటు | 30 గ్రూపులు |



**రుణాల పంపిణీ వివరాలు..**

| | | |
|---|---|---|
| రుణాల మంజూరు | రూ. 126.68కోట్లు, | 83,659 వీధి వ్యాపారులు |
| రుణాల పంపిణీ | రూ.81.45 కోట్లు , | 64,178 వీధి వ్యాపారులు |
| మొదటి విడతలో చెల్లించిన రుణాలు | రూ. 55.62 కోట్లు, | 55,929 వీధి వ్యాపారులు |
| రెండో విడతలో చెల్లించిన రుణాలు | రూ. 44.68 కోట్లు, | 22,384 వీధి వ్యాపారులు |
| మూడో విడతలో చెల్లించిన రుణాలు | రూ.26.38 కోట్లు, | 5,346 మంది వీధి వ్యాపారులకు లబ్ధి |

# జేఎన్-1ను ఎదుర్కొంటాం

**అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నాం**

**ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ నాగేందర్**



దవాఖానలో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 27: కొవిడ్-19 జేఎన్-1 వేరియంట్ వ్యాప్తిని అరికట్టేందుకు ఉస్మానియా దవాఖానలో అవసరమైన అన్ని వసతులను సిద్ధంగా ఉంచామని దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ తెలిపారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో ఆర్ఎంవోలు, సంబంధిత శాఖల వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, హెల్త్ ఇన్‌స్పెక్టర్‌లతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిత్యం పెరుగుతున్న కొవిడ్ పాజిటివ్ కేసులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వైద్యాధికారులు, సిబ్బంది అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. దవాఖానలో కొవిడ్-19 పరిస్థితిని సమన్వయం చేయడానికి జనరల్ మెడిసిన్ విభాగం నుంచి నోడల్ అధికారిని నియమిస్తామన్నారు. దవాఖానకు వైద్యం కోసం వచ్చే రోగులు, దవాఖానలో ఇన్‌పేషెంట్లుగా ఉన్న రోగులు, రోగి సహాయకులు, దవాఖాన సిబ్బంది తప్పకుండా కొవిడ్ నిబంధనలు పాటించేలా చూడాలని ఆర్ఎంవోలను ఆదేశించారు. కొవిడ్ కేసుల సంఖ్య పెరుగుతున్నందున ప్రజలు భయాందోళన చెందవద్దన్నారు. దవాఖానలో కొవిడ్ బారిన పడిన వారికి ప్రత్యేకంగా ఐసొలేషన్ వార్డును ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రస్తుతం ఆ వార్డులో ముగ్గురు ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారని తెలిపారు. దవాఖానలో ఇద్దరు చికిత్స పొందుతూ మరణించిన అనంతరం కొవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయిన విషయం విధితమే. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉస్మానియా పాలకవర్గం పటిష్ట చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దవాఖాన సీఎస్ ఆర్ఎంవో-1 డాక్టర్ శేషాద్రి, డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోలు డాక్టర్ సాయిశోభ, డాక్టర్ బండారి శ్రీనివాసులు, ఆర్ఎంవోలు డాక్టర్ కవిత, డాక్టర్ సిద్ధిఖీ, డాక్టర్ అనురాధ, డాక్టర్ ఎండీ రఫీ, డాక్టర్ విజయభాస్కర్, హెల్త్ ఇన్‌స్పెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

**కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్**

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 27: వైద్యం కోసం వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఐఏఎస్ ఆర్‌వీ కర్ణన్ అధికారులకు సూచించారు. బుధవారం ఆయన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారి ఉస్మానియా దవాఖానను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్‌తో కలిసి దవాఖానలోని ఓపీ బ్లాక్‌లోని రిజిస్ట్రేషన్ కౌంటర్, క్యూడీసీ బ్లాక్‌లోని వార్డులతో పాటు ల్యాబ్‌లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొవిడ్ వ్యాప్తి నేపథ్యంలో దవాఖానకు వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దవాఖాన సీఎస్ ఆర్ఎంవో-1 డాక్టర్ శేషాద్రి, డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోలు డాక్టర్ సాయిశోభ, డాక్టర్ బండారి శ్రీనివాసులు, ఆర్ఎంవోలు డాక్టర్ ఎండీ రఫీ, డాక్టర్ కవిత, డాక్టర్ సిద్ధిఖీ, డాక్టర్ విజయ భాస్కర్ పాల్గొన్నారు.



ఉస్మానియా దవాఖాన ఔట్ పేషెంట్ రిజిస్ట్రేషన్ కౌంటర్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్

## ఆమ్రపాలికి ఐటీసెల్, ఎస్టాబ్లిష్‌మెంట్ పర్యవేక్షణ

సిటీబ్యూరో, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ( హెచ్ఎండీఏ) జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా నియమితులైన ఆమ్రపాలికి పలు విభాగాల బాధ్యతలను అప్పగిస్తూ మెట్రోపాలిటన్ కమిషనర్ దానకిశోర్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా దానకిశోర్‌ను, జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా ఆమ్రపాలిని నియమించింది. కాగా ఇప్పటి వరకు హెచ్ఎండీఏలో ఉన్న విభాగాలన్నింటి పర్యవేక్షణ బాధ్యతలు మెట్రోపాలిటన్ కమిషనర్‌కే ఉండేవి. కొత్తగా మెట్రోపాలిటన్ జాయింట్ కమిషనర్‌గా ఆమ్రపాలిని నియమించడంతో హెచ్ఎండీఏలో ఆమెకు ఎలాంటి బాధ్యతలు అప్పగిస్తారోనన్న అంశం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా సీనియర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ స్థాయి అధికారిని నియమించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఆ బాధ్యతలను ఎంఎయూడీఏ స్పెషల్ చీఫ్ సెక్రెటరీగా ఉన్న అర్వింద్‌కుమార్ నిర్వహించారు. ఆయనను ప్రభుత్వం బదిలీ చేసి, కొత్తగా ఎంఎయూడీఏ కమిషనర్‌గా నియమించిన దాన కిశోర్‌కే పూర్తి అదనపు బాధ్యతల్లో భాగంగా మెట్రోపాలిటన్ కమిషనర్‌గా నియమించింది. ఇలా ఒకేసారి హెచ్ఎండీఏలో ఇద్దరి నియామకంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఎట్టకేలకు జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా నియమితులైన ఆమ్రపాలికి ఎస్టాబ్లిష్‌మెంట్(పరిపాలన), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) సెల్ విభాగాల పర్యవేక్షణ విభాగాల బాధ్యతలను అప్పగిస్తూ మెట్రోపాలిటన్ కమిషనర్ దాన కిశోర్ ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆమ్రపాలి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను కలిగి ఉన్నారు.

## రాష్ట్ర మైనార్టీ గురుకులాల ప్రిన్సిపాల్స్ సంఘం ఎన్నిక



రాష్ట్ర మైనార్టీ గురుకులాల ప్రిన్సిపాల్స్ సంఘం నూతన అధ్యక్షుడు కె.విద్యాసాగర్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు

చాదర్‌ఘాట్, డిసెంబర్ 27: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ గురుకులాల ప్రిన్సిపాల్స్( టీఎంఆర్‌ఆర్‌పీఏ) సంఘం నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా కె.విద్యాసాగర్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కె.విద్యాసాగర్ మాట్లాడుతూ మైనార్టీ విద్యార్థుల సంక్షేమం కోసం రాష్ట్ర వ్యాప్తంగా 204 గురుకులాల్లో నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం వసతులు కల్పిస్తున్నదని తెలిపారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా గురుకులాల్లో బోధిస్తున్నామని చెప్పారు. టీఎంఆర్‌ఆర్‌పీఏ నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా కె.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ తాజొద్దీన్, ఉపాధ్యక్షులుగా కె.సురేశ్, ఎస్.లావణ్యరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా రమేశ్ లాల్, షాహీన్ షేక్, పరిపాలన కార్యదర్శిగా జంగ సతీశ్, కోశాధికారిగా డా.యాదయ్య, ఆడిట్ సభ్యులుగా పి.సంపత్, నిర్మలతో పాటు పది మంది రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా ఇన్‌చార్జిలను ఎన్నుకున్నట్లు విద్యాసాగర్ తెలిపారు.

## 31న ఉచితంగా సివిల్స్ మాక్ ఇంటర్వ్యూలు

చిక్కడపల్లి, డిసెంబర్ 27: యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌లో మెయిన్స్ ఉత్తీర్ణులై ఇంటర్వ్యూకు వెళ్లే విద్యార్థులకు శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీ ఉచితంగా సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్స్‌తో మాక్ ఇంటర్వ్యూలు, ఉచిత ఇంటర్వ్యూ గైడెన్స్ అందించనున్నట్లు అకాడమీ ఎండీ శరత్ చంద్ర తెలిపారు. ఇందులో భాగంగా మాజీ చీఫ్ సెక్రటరీ కే.ఎన్.కుమార్, మాజీ అదనపు డీజీపీ జి.హెచ్.రాజు, అడిషనల్ డీజీపీ శంఖ బ్రతా తదితరులు శరత్ చంద్ర అకాడమీ అశోక్‌నగర్ బ్రాంచ్‌లో ఈ నెల 31న ఉచితంగా మాక్ ఇంటర్వ్యూలు, ఇంటర్వ్యూ గైడెన్స్ నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 94941 88688లో సంప్రదించాలని సూచించారు.

## ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాల వద్ద నీటి సరఫరా

సిటీబ్యూరో, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రజా పాలన కార్యక్రమంలో జీహెచ్ఎంసీ , ఓఆర్ఆర్ పరిధిలో దరఖాస్తులు స్వీకరించే వార్డు సభల వద్ద జలమండలి తాగునీరు సరఫరా చేయనుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఎండీ సుదర్శన్‌రెడ్డి సంబంధిత జనరల్ మేనేజర్లను ఆదేశించారు. జీహెచ్ఎంసీ, ఇతర సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు.